

కొబ్బరి మొక్కలు అమ్మకానికి సిద్ధం

బూర్జ: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఉద్యాన పరిశోధన స్థానం పెద్దపేట గ్రామంలో ఈస్ట్‌కోస్ట్ టాల్ కొబ్బరి మొక్కలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ప్రధాన శాస్త్రవేత్త ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్క మొక్క ఖరీదు రూ.100లు అని పేర్కొన్నారు. కొబ్బరి మొక్కలు కావాల్సిన రైతులు 80748 42696 నంబర్‌ను సంప్రదించాలన్నారు.









బోల్తాపడిన లగేజీ వ్యాన్

నరసన్నపేట: జాతీయ రహదారిపై శుక్రవారం మధ్యాహ్నం లగేజీ వ్యాన్ అదుపుతప్పి కోమర్తి వద్ద రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. అయితే ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. శ్రీకాకుళం నుంచి పలాసకు చెప్పుల బాక్స్‌లతో ఈ లగేజీ వాహనం వెళ్తోంది. కోమర్తి వద్దకు వచ్చేసరికి వ్యాన్ టైర్ పంక్చర్ కావడంతో ఒక్కసారిగా అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాద సమయంలో వ్యాన్‌లో ఇద్దరు ఉండగా సురక్షితంగా బయటపడ్డారు. ఆ సమయంలో వెనుక నుంచి లారీలు రాకపోవడంతో ప్రమాదం తప్పిందని వ్యాన్ సిబ్బంది అన్నారు.

జంగిల్ క్లియరెన్స్


పాతపట్నం: మండలంలోని పాతపట్నం-తెంబూరు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను పోలీసులు శుక్రవారం తొలగించారు. పాతపట్నం సీఐ వి.రామారావు ఆదేశాలతో రహదారి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. పాతపట్నం నుంచి పెద్దలోగిడి, గంగువాడ మీదుగా తెంబూరు వరకు సుమారు 14 కిలోమీటర్ల వరకు జంగిల్ క్లియరెన్స్ చేపట్టామన్నారు.

పనులు వేగవంతం చేయాలి

మెళియాపుట్టి: ఐటీడీఏ, పల్లె పండుగలో చేపట్టాల్సిన పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా అన్నారు. శుక్రవారం పీఆర్ ఏఈ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమీక్షించారు. 85 పనులకు 56 పూర్తి చేశారని, మిగిలిన పనులు వేగవంతం చేయాలని, రోజువారీ ప్రోగ్రెస్ ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఈ పీఆర్ ఆనంద్, ఏపీవో రవి, ఈసీ ఈదినారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత

పాతపట్నం: పాతపట్నం రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లు నిలుపుదల చేయాలని కేంద్ర భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మను కోరామని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.నారాయణమూర్తి తెలిపారు. ఈ మేరకు మంత్రి శ్రీనివాసవర్మను విశాఖపట్నంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. రూర్కెలా నుంచి గుణుపూర్ వెళ్తున్న రాజారాణి ఎక్స్‌ప్రెస్ తదితర రైళ్లు పాతపట్నం రైల్వేస్టేషన్‌లో ఆపాలని కోరామన్నారు. అలాగే పాతపట్నం రైల్వేస్టేషన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు.


మంత్రి శ్రీనివాసవర్మకు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి తదితరులు

కేజీబీవీలో తనిఖీలు

పొందూరు: మండలంలోని లోలుగు కేజీబీవీలో డీఆర్పీ పద్మలత పర్యవేక్షణలో సామాజిక తనిఖీలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, విద్యార్థినుల విద్య, ఆరోగ్యం, అందజేస్తున్న మెనూ పరిశీలించారు. అలాగే స్టాక్ రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు.

అనంతరం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించి పలు విషయాలను అడిగి నమోదు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఎ.కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న సామాజిక తనిఖీ బృందం

అక్రమ నిర్మాణాలు తొలగింపు


ప్రహరీ తొలగిస్తున్న దృశ్యం

కొత్తూరు: మండలంలోని గూనభద్ర పంచాయతీ పరిధి పాతజ్యూట్ మిల్లు స్థలంలో నిర్మిస్తున్న లేఅవుట్‌కు సంబంధించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మాణాలు చేస్తున్నట్లు గ్రామస్తులు తహసీల్దార్ రవిచంద్రకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సర్వే నిర్వహించి ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేసినట్లు గుర్తించినట్లు మండల సర్వేయర్ గవరయ్య తెలిపారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న ప్రహరీ గోడను రెవెన్యూ సిబ్బంది దగ్గరుండి శుక్రవారం తొలగించారు. లేఅవుట్‌లో ప్రభుత్వ స్థలం ఎంత విస్తీర్ణం ఉన్నదనేది సర్వే పూర్తయిన తర్వాత నిర్ధారించడం జరుగుతుందన్నారు. అక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవో ఆదేశించినట్లు తహసీల్దార్ రవిచంద్ర తెలిపారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు


డ్రైనేజీ ఔట్‌లెట్లు పరిశీలిస్తున్న ఎస్ఈ తదితరులు

నరసన్నపేట: మేజర్ పంచాయతీ నరసన్నపేటలో భూగర్భ డ్రైనేజీ నీరు ప్యూరిఫైర్ చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఇషాన్ భాషా తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు నరసన్నపేటలో భూగర్భ డ్రైనేజీ సిస్టం పనితీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కలెక్టర్ నరసన్నపేట వచ్చినప్పుడు భూగర్భ డ్రైనేజీని పరిశీలించారన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మురుగు నీరు ప్యూరిఫైర్ చేయాల్సిన అవసరాన్ని వివరించారని పేర్కొన్నారు. ఈ మేరకు పరిశీలనలు జరుగుతున్నాయని వివరించారు. ఆయనతో పాటు ఈఈ రంగనాథం, డీఈ సుదర్శనరావు, ఏఈ కనకేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గడ్డికుప్ప దగ్ధం

ఎల్.ఎన్.పేట: మండలంలోని జాడుపేట గ్రామంలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గోక జగ్గారావు అనే రైతుకు చెందిన ఏడు ఎకరాల గడ్డికుప్ప దగ్ధమయ్యింది. అగ్ని ప్రమాదానికి కారణం తెలియనప్పటికీ ఒక్కసారిగా మంటలు ఎగసి పడడంతో స్థానికులు పరుగున ఘటన స్థలానికి చేరుకున్నారు. మంటలు అదుపు చేయలేని పరిస్థితి ఏర్పడడంతో కొత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సమాచారం తెలుసుకున్న ఆర్ఐ ఎస్.గవరయ్య గ్రామానికి చేరుకుని నష్టాన్ని అంచనా వేశారు. పశువుల మేత కోసం ఉంచుకున్న ఏడు ఎకరాల గడ్డికుప్ప అగ్ని ప్రమాదంలో కాలిపోయిందని బాధిత రైతు ఆందోళన చెందుతున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

మెళియాపుట్టి: హిరమండలం నుంచి మెళియాపుట్టి మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొసమాల వీఆర్వో కేదారేశ్వరరావు శుక్రవారం పట్టుకున్నారు. అక్రమంగా ఇసుకను హిరమండలం రీచ్ నుంచి ఒడిశాలోని ఉప్పలాడ గ్రామానికి తరలిస్తున్నట్లు తెలుసుకుని మెళియాపుట్టి వద్ద ట్రాక్టర్‌ను అధికారులు అడ్డుకున్నారు. అయితే కేవలం రూ.2 వేలు మాత్రమే అపరాధ రుసుం విధించి విడిచిపెట్టినట్లు తెలుస్తోంది.

రాజుల చెరువు పరిశీలన

నరసన్నపేట: స్థానిక రాజుల చెరువు స్థితిగతులు, చుట్టూ ఉన్న ఆక్రమణలు, వివిధ సంస్థలకు చెందిన నిర్మాణాలను ఆర్డీవో సాయి ప్రత్యూష, డీపీవో సౌజన్య భారతి, సర్వే డిపార్ట్‌మెంట్ ఏడీ ఆర్.విజయకుమార్‌లు శుక్రవారం పరిశీలించారు. చెన్నైలోని ఎన్‌జీటి కోర్టు ఆదేశాల మేరకు వీరు పరిశీలన చేశారు. రాజుల చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, చెరువును పునరుద్ధరించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో గరీబ్ గైడ్ అనే స్వచ్ఛంద సంస్థ గతేడాది ఆగస్టులో పిటిషన్ వేసింది. దీనిపై ఇప్పటికే పలుదఫాలుగా విచారణ, వాదోపవాదనలు జరిగాయి. దీంతో చెరువు వాస్తవ పరిస్థితి, విస్తీర్ణంపై నివేదిక తయారు చేసి కోర్టుకు పంపేందుకు వీలుగా పరిశీలన చేశారు. వీరితో పాటు నరసన్నపేట తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్ అప్పలస్వామి, ఈవో ద్రాక్షాయిణి తదితరులు ఉన్నారు.

46 మందికి స్కాలర్‌షిప్‌లు

నరసన్నపేట: స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో చదువుతున్న 46 మంది విద్యార్థినులకు సంతూర్ స్కాలర్‌షిప్‌లు మంజూరయ్యాయి. ఒక్కొక్కరికి ఏడాదికి రూ.24 వేలు మంజూరు చేశారు. దీంట్లో భాగంగా ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల ఖాతాలకు నగదు జమ అయినట్లు కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. విప్రో కేర్ సంస్థ ఏటా పేద గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈవిధంగా స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తుంది. దీంట్లో కళాశాలకు చెందిన పేద విద్యార్థులు 46 మంది ఉండడం ఆనందంగా ఉందన్నారు. ఇంటర్ వరకు ప్రభుత్వ కళాశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్స్ మంజూరవుతాయన్నారు.


సంతూర్ స్కాలర్‌షిప్స్ పొందిన విద్యార్థినులు





